క్లుప్తంగా

గోరింటాకు వేడుక



జనగామ: ఆషాఢ మాసం పర్వదినం పురస్క రించుకుని పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో శనివారం గోరింటాకు వేడుకలను నిర్వ హించారు. టీచర్లు కొత్తపల్లి స్వప్న, కృష్ణవేణి, అర్చన, శిరీష, శ్వేత, రేణుక ఆధ్వర్యంలో గోరింటాకును పిల్లల చేతులకు అలంకరించారు. అనంతరం గోరింటాకు విశిష్టతను పిల్లలు, ఉపాధ్యాయులకు వివరించారు.

హన్మంతాపురం పాఠశాలలో..



నర్మెట: ఆషాఢ మాసం పురస్కరించుకని హన్మంతాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోరింటాకును టీచర్లు చిన్నారుల చేతులకు అలంకరించారు. హెచ్‌ఎం రమేష్, విద్యావతి, మమత, సంధ్య, అనిత, స్వప్న, ఐలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యశిబిరం

చిల్పూరు: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు తాళ్లపల్లి క్రాంతికుమార్‌గౌడ్ అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన నారాయణ మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం జీపీ ఆవరణలో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని నాయకుడు జనగామ యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. బత్తుల రాజన్ బాబు, మోటం రాములు, ప్రభాకర్, చుక్క అరుణ్, తాళ్లపల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు దివ్యాంగులకు, చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం సోమరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, చేయూత పెన్షన్‌దారులకు నెలకు రూ.4వేలు అందించాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్, నాయకులు నలిమెల నాగరాజు, మంద శ్రీనివాస్, గుర్రం అశోక్, గాదె శ్రీధర్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, సంజీవ, కృష్ణమూర్తి, ఎల్లయ్య, ఉప్పలయ్య, అనీత, శ్రీనివాస్, నర్సయ్య, యాదగిరి పాల్గొన్నారు.

'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'

నర్మెట: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ భీంరావ్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని అంబేడ్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురాములు డిమాండ్ చేశారు. లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా శనివారం మండలకేంద్రానికి విచ్చేసిన ఆయనకు దళిత బహుజన సంఘాలు స్వాగతం పలుకగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. బహుజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కిసోర్, నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మహ్మద్ యూనస్, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

దేవరుప్పుల: వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు నవాబుపేట రిజర్వాయర్ ద్వారా మండలంలోని జనగామ–సూర్యాపేట రహదారి ఏరియా గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ ఆండాళ్‌కు పంటల సాగు పరిరక్షణ కోసం సాగు నీటిని అందించాలని వినతిపత్రం అందజేశారు.

వినతి

జఫర్‌గఢ్: దేవాదుల ద్వారా చెరువులు, కుంటలు నింపి పంటలకు సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ శంకరయ్యకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు.

బ్యాగు లేకుండా బడికి..



జనగామ: కొడవటూరు పీఎస్‌లో మాట్లాడుతున్న బొమ్మనబోయిన శ్రీనివాస్



పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు



రఘునాథపల్లి: నో బ్యాగ్ డే సందర్భంగా ఆటలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- ప్రతీ నెల నాలుగో శనివారం నోబ్యాగ్ డే
- జిల్లా అంతటా పాఠశాలల్లో పండుగ వాతావరణం
- ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు

జనగామ: విద్యార్థులపై బ్యాగు బరువు తగ్గించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని ప్రోత్స హించి ఆరోగ్యకరమైన అభ్యాసన వాతావరణాన్ని పెంపొందించే దిశగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరో అడుగు ముందుకు వేసింది. స్కూల్‌బ్యాగ్ పాలసీ–2020 సిఫార్సుల మేరకు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రతీ నెల నాలుగో శనివారం బ్యాగ్ లేని దినోత్సవం (నో బ్యాగ్ డే) జరుపుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత రోజుల్లో రెగ్యులర్ చదువుల నుంచి ఒక్క రోజు పాటు విశ్రాంతి కల్పించి శారీరక, మానసిక, మేథో శక్తి, సమాజంపై అవగాహన పెంపొందించే లా పాఠశాలలకు మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసింది. 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు పాఠశాలలు పని చేసే 10 నెలల్లో పది రోజుల పాటు ఈ కార్యక్రమం అమలు చేయాల్సి ఉంటుంది. స్కూల్స్‌లో గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు తోడు కులవృత్తులు వడ్రంగి, తోటమాలి, కుమ్మరులు, వృత్తి నిపుణుల ప్రదేశాలకు విద్యార్థులను తీసుకు వెళ్లాలి. చదువుతో పాటు సమాజంలో బతుకుదెరువు కోసం శ్రమిస్తున్న శ్రామికులు, కులవృత్తుల ప్రాధాన్యత నేర్చుకోవడానికి అనుభవపూర్వక, ఆచరణాత్మక, ఇంటరాక్టివ్ కార్యకలాపాలపై వారికి అమూల్యమైన అవకాశం కలుగుతుంది. వీటితో పాటు మ్యూజియం, చారిత్రక ప్రదేశాలు, ఉద్యానవనాలు, స్మారక చిహ్నాలు తదితర వాటిని సందర్శించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలి. నో బ్యాగ్ డే దినోత్సవం రోజు ఇలా చేయడం వల్ల భవిష్యత్ కెరీర్ గురించి ఆలోచన పెరగడంతో పాటు ఉన్నతి కోసం నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

జిల్లాలో పండుగ వాతావరణం..

జనగామ 508 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్ డే దినోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. డీఈఓ భోజన్న ఆదేశాల మేరకు జిల్లా అకడమిక్ ఆఫీసర్ బొమ్మనబోయిన శ్రీనివాస్, తదితర విద్యాశాఖ అధికారులు మొదటి రోజు ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులకు ఒక్క రోజు ముందుగానే సమచారం ఇవ్వగా.. విద్యార్థులు ఎవరూ కూడా బ్యాగు, పాఠ్య, నోట్ పుస్తకాలు లేకుండానే బడికి వచ్చారు. ప్రార్థన పూర్తవగానే.. టీచర్లు పిల్లలతో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. నాలుగో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంతో బరువైన బ్యాగులను మోయడం వల్ల కలిగే భారాన్ని విద్యార్థులపై ఒక్కరోజు పాటు తగ్గించడం జరుగుతుందని శ్రీనివాస్ అన్నారు. అలాగే సాంప్రదాయ తరగతి గది అభ్యాసం నుంచి విరామం తీసుకుని, అనుభవపూర్వక, ఆచరణాత్మక, ఇంటరాక్టివ్ కార్యకలాపాలపై పిల్లలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నర్మెట: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి టికెట్లు ఇచ్చినా సమన్వయంతో అందరూ కలిసి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ కోరారు. గండిరామారంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి వివరించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక స్థానాల్లో గెలిపించి సంక్షేమానికి బాటలు వేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గద్దల రవి, జిల్లా, మండల నాయకులు భూక్య జయరాం, చెవుల పరశురాములు, గొల్లపల్లి బాలచందర్, కూకట్ల చంద్రమౌళి, వంగ భూపాల్ రెడ్డి, ఆంగోత్ రవి, వాడపల్లి రాజు, ప్రెజ్ఞాపురం శ్రీధర్, బుర్రా రాజు, గద్దల సుదర్శన్, తుప్పుడు రమేష్, చెవుల కుమార్, రాజు, గద్దల యాకూబ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

బచ్చన్నపేట: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కాంగ్రెస్ పార్టీ బండనాగారం గ్రామ నాయకుడు ఇజ్జగిరి రాములు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో నెరవేరుతోందన్నారు.

'పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు'

జనగామ రూరల్: ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలు ఏ ఒక్క పతకానికి నోచుకోలేదన్నారు.



మాట్లాడుతున్న బనుక శివరాజ్

మెరుగు బాలరాజు, వంగాల మల్లారెడ్డి, తుపాకుల రాములు, బైరగోని చంద్రం, గుండా శ్రీలత శ్రీధర్ రెడ్డి, గొలుసుల దుర్గేష్, ఆనంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

నర్మెట: ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మోసాలను ప్రజల్లో ఎండగట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర నాయకుడు ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ బాల్నె సిద్ది లింగం, మండల శాఖ అధ్యక్షుడు చింత కింది సురేష్ అన్నారు. మండలకేంద్రంతో పాటు వెల్దండలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన వారు గెలుపుకోసం దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, అమలు చేయని ఎన్నికల హామీలను ప్రజలకు వివరించి కాంగ్రెస్‌ను నిలదీయాలని అన్నారు. మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్ మాజీ సర్పంచ్‌లు వెంకట రమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, నాయకులు వంగ ప్రణీత్‌రెడ్డి, ప్రెజ్ఞాపురం అంజయ్య, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చూపాలి

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేసి బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చూపాలని మండల ఇన్‌చార్జ్‌లు గద్దల నర్సింగారావు, పెద్ది రాజిరెడ్డిలు అన్నారు. సాల్వాపూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పోచయ్య, తిరుపతి, బిక్షపతి, వెంకటేష్, రామచంద్రం, కొండయ్య, భాను, నర్సింహులు, సంతోష్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసపాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులెవరైనా బీఆర్‌ఎస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం కేసీఆర్‌పై, డాక్టర్ రాజయ్యపై సొంతంగా పాట రాసిపాడిన కళాకారుడు బూరుగు రవిని రాజయ్య శాలువాతో సన్మానించారు. చింతకుంట్ల జగన్‌రెడ్డి, అక్కినపెల్లి బాలరాజు, తాటికొండ సురేశ్‌కుమార్, ఆకుల కుమార్, గణేశ్, నర్సింహారెడ్డి, చందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగు మందు డబ్బాతో నిరసన



పురుగు మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న పోతన దంపతులు

పాలకుర్తి టౌన్: ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తనకు మంజూరు కాలేదని మండలంలోని బమ్మెరకు చెందిన బరిగెల పోతన, రేణుక దంపతులు శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పురుగుమందు డబ్బాతో నిరసన తెలిపారు. తమకు ఇల్లు మంజూరు చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామన్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రవీందర్ మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోతన దంపతులు నిరసను విరమించారు.

తెలంగాణ సంస్కృతిని పరిరక్షించాలి

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచే తెలంగాణ ప్రాంత సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు విద్యార్థులు సంసిద్ధులు కావాలని హెచ్‌ఎం నల్ల లలిత సూచించారు. శనివారం మాధాపురం ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ పురస్కరించుకుని చిన్నారులు నెత్తిన బోనాలతో ప్రదర్శన చేసి తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో బోనాల పండుగ విశిష్టతను తెలిపే అవగాహన ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులు సుజిత్, జీవన్, నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బోనాల పండుగ

జఫర్‌గఢ్: బోనాల పండుగను పురష్కరించుకుని మండల కేంద్రంలోని కేజీబీవీలో ఉపాధ్యాయినులు, విద్యార్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ స్వప్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థినులతో బోనాల పండుగను నిర్వహించినట్లు తెలిపారు.



దేవరుప్పుల: బోనాలతో విద్యార్థులు

ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుధా స్కూల్‌లో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో సుధా స్కూల్‌లో ముందస్తు బోనాల పండుగ నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



కొడకండ్ల: మొక్క నాటుతున్న ఎస్‌ఓ జ్యోతి



లింగాలఘణపురం: మొక్కలు నాటుతున్న ఎంఈఓ విష్ణుమూర్తి, ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: ఆక్సిజన్ రూపంలో ప్రాణవాయువును ఇస్తూ మానవ మనుగడకు దోహద పడే మొక్కల పెంపకాన్ని ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకుని నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని పలువురు కోరారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవంలో భాగంగా విద్యాలయాల్లో, చెరువు కట్టలపై మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని అన్నారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు, ఎస్‌ఓలు, హెచ్‌ఎంలు, ఎక్సైజ్ పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభ్రమైన వాతావరణంలో వండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల వంట నిర్వాహకులు పరిశుభ్ర పరిసరాల్లో వంటలు వండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌కుమార్ అన్నారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని నమిలిగొండ శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌ను ఆర్‌బీఎస్‌కే బృందంతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో వంటశాలలను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అజయ్‌కుమార్, పద్మజ, ఏఎన్‌ఎం మౌనిక, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, కేజీబీవీ ఎస్‌ఓ రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వంట కార్మికులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌కుమార్

క్రీడలతో శారీరక దారుఢ్యం



క్రీడాకారులతో అతిథులు

జనగామ రూరల్: క్రీడలతో శారీరక దారుఢ్యం లభిస్తుందని ప్రజా వైద్యులు డాక్టర్ రాజమౌళి, ప్రీతి దయాల్ అన్నారు. శనివారం సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా సంబరాల పోటీలను పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళంపల్లి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా వారు ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ నాయకులు సుభాష్, ఓయూ జేఏసీ నాయకుడు కరుణాకర్, బీఎస్‌ఎఫ్ నాయకులు ప్రవీణ్, నల్ల రాహుల్, సోషల్ వాయిస్ ఫౌండేషన్ సభ్యులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేయొద్దు

లింగాలఘణపురం: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని మండల స్పెషల్ ఆఫీసర్ హాతీరామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆయనతో పాటు మండల పరిషత్ అధికారి రఘురామకృష్ణ, ఎంఎన్‌ఓ విష్ణుమూర్తి, హెచ్‌ఎం మల్లికార్జున్ తదతరులు ఉన్నారు. అదేవిధంగా ఎంఈఓ విష్ణుమూర్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించి స్వయంగా అక్కడే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనంపై సంతృప్తి వ్యక్తం చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

సంక్షిప్త సమాచారం

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

పాలకుర్తి టౌన్: నియోజవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. హైదరాబాద్‌లో మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజవర్గంలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై సుదీర్ఘంగా చర్చించారు.

నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్నికలు

పాలకుర్తి టౌన్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎస్‌పీఎల్ ఎన్నికలు దోహదపడుతాయని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య అన్నారు. గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లాస్ లీడర్, స్కూల్ స్టూడెంట్ లీడర్(ఎస్‌పీఎల్) ఎన్నికలు శనివారం సాధారణ ఎన్నికల తహరహాలో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాల అభివృద్ధికి సాయం

నర్మెట: మండలకేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల మౌలిక వసతుల కల్పన కోసం ఉపాధ్యాయ సహకార పొదుపు సంఘం, నర్మెట ఉపాధ్యాయులు శనివారం హెచ్‌ఎం నీలం వేణుకు రూ.7 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇతోదికంగా తోడ్పాటు అందిస్తామని అన్నారు. పాతూరి ఆంజనేయులు, ఎలగొండ రవి, నరేందర్, ఆనందాసు రాధాకృష్ణ, వెంకటయ్య, అంబదాసు పాల్గొన్నారు.

నటుడు ఫిష్ వెంకట్ మృతి కళారంగానికి తీరనిలోటు

స్టేషన్‌ఘన్‌పూర్: టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ మృతి కళారంగానికి తీరనిలోటని స్థానిక స్పందన ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగుడుంపురం కిషోర్‌కుమార్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిష్ వెంకట్ మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లు శివారులోని రైల్వే గేటు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి(50) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. స్థానిక సీఐ జి.వేణు, ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేగేటు సమీపాన ఉన్న ఓ చెట్టుకు వ్యక్తి ఉరివేసుకుని ఉన్న విషయాన్ని గమనించిన అటుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దాంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు యాభై సంవత్సరాల వయస్సు ఉంటాడని, ఎరుపు రంగులో ఉన్నట్లు తెలిపారు. పింక్ కలర్ ఆఫ్ టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి అశోక్(58) మే 9న ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్ గ్రామంలో గీతవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కాగా, మే 9న కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అశోక్‌ను మొదట జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు.

భూతగాదాలో ఒకరికి గాయాలు

బచ్చన్నపేట: భూ తగాదాలో కొడవలితో దాడి చేయగా ఒకరు గాయపడ్డ సంఘటన మండలంలోని కొడవటూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఈవిషయమై ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లం శ్రీశైలం, మల్లం శ్రీహరిల మధ్య భూ తగాదాలు నడుస్తుంది. ఈ క్రమంలో శనివారం శ్రీశైలం భూమి దున్నుతుండగా ఇరువురికి గొడవ జరిగింది. శ్రీహరి కొడవలితో దాడి చేయగా శ్రీశైలంకు గాయాలయ్యాయి. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొడకండ్ల: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హరికృష్ణ సూచించారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచించారు.

బనకచర్ల ద్రోహాన్ని బద్ధలుకొట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: బనకచర్ల ద్రోహాన్ని బద్దలు కొడుతూ ఆంధ్రప్రదేశ్ జలదోపిడీని అడ్డుకునేలా అందరూ చైతన్యం కావాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నీటిపై న్యాయమైన హక్కును సాధించుకునేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న బనకచర్ల నీటి హక్కుల కోసం జంగ్ ఉద్యమంలో భాగంగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం తెలంగాణ నీటి హక్కుల జంగ్ సైరన్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

సాగునీటి పైపులైన్ నిర్మాణానికి సర్వే

తరిగొప్పుల: నర్సాపూర్ గ్రామంలోని ఊరకుంటను దేవాదులు ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి జలాలతో నింపేందుకు పైపులైన్ నిర్మాణం కోసం సంబంధిత ఇరిగేషన్ అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎంపీ, డీసీసీ అధ్యక్షుడు సూచనల మేరకు సర్వే చేపట్టడం జరిగిందన్నారు.

హాస్టల్ తనిఖీ చేసిన తహసీల్దార్

కొడకండ్ల: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం తహసీల్దార్ కోల చంద్రమోహన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి హాస్టల్ పరిసరాలు, మరుగుదొడ్లను, స్టాక్‌ను తహసీల్దార్ పరిశీలించారు.

'ప్రశ్నించే గొంతుక కోసమే కాంగ్రెస్‌కు రాజీనామా'

దేవరుప్పుల: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుక కోసమే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఓయు జాక్ విభాగం ముఖ్య నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు, అనునిత్యం శ్రమించినా శ్రేణుల్ని విస్మరిస్తున్న విషయమై ప్రశ్నిస్తే కక్ష్యసాధింపు చేపట్టే దుశ్చర్యలు కలిచి వేశాయన్నారు. దీంతో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్న విషయమై జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పంపించినట్టు తెలిపారు.

జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: గ్రామాల్లో పేరుకుపోయిన స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 22న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం నిడిగొండలో ఆయన పార్టీ నాయకులతో కలిసి స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు.